ప్రజల ఆరోగ్య క్షేమమే ముఖ్యమంత్రి ధ్యేయం

కడప : రాష్ట్ర ప్రజల ఆరోగ్య క్షేమమే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రధాన ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజాద్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం నగరంలో తన క్యాంపు కార్యాలయంలో అనారోగ్య కారణాలతో ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న నగరానికి చెందిన గండికోట హారిణికి రూ.1,00,000లు, పెద్దపోగు అక్షయ్ యువరాజ్‌కు రూ.6,00,000లు, తిరుపతి శ్రీరాములు కు రూ.7,00,000లు, షేక్ తహీరాకి రూ.7,00,000లు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను వారి కుటుంబ సభ్యులకు ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియోజకవర్గ ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకుంటూ ఆరోగ్య సమస్యలతో ఖరీదైన వైద్య సదుపాయాలు పొందలేని వారికి సీఎం రిలీఫ్ ఫండ్ కోసం రాష్ట్ర ముఖ్యమంత్రికి విన్నవించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్పొరేటర్లు, సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బదిలీల జాతర!

ఉద్యోగుల్లో టెన్షన్..టెన్షన్..
రాజకీయ సిఫారసుల కోసం పరుగులు
జిల్లా పరిషత్ ఉద్యోగుల పైరవీల వెల్లువ
నేటి నుంచి కసరత్తు షురూ

ఉమ్మడి జిల్లాలో బదిలీల జాతర మొదలైంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఐదేళ్లుగా ఒకేచోట బాధ్యతలు నిర్వహించిన ఉద్యోగులకు బదిలీ అనివార్యం. రెండేళ్లు నిండిన ఉద్యోగులు తమ అవసరాల రీత్యా దరఖాస్తులు చేసుకుంటే క్లియర్ వేకెన్సీ ఉంటే బదిలీ లకు అవకాశం ఉంటుంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో 120 డిపార్టుమెంట్లకు చెందిన సుమారు 25 వేల మంది ఉద్యోగులు ఉన్న సంగతి తెలిసిందే. వీరిలో ఐదేళ్లు ఒకే ప్రాంతంలో పని చేసిన ఉద్యోగులు వేలాది మంది ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నెల 27వ తేదీ లోపు రిక్వెస్ట్, అడ్మినిస్ట్రేషన్ తదితర ఆప్షన్ల ఎంపికకు గడువు ఇవ్వడం తెలిసిందే. ఇప్పటి వరకు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లడంపై ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీల గుబులు పట్టుకుంది. ప్రభుత్వ పరిధిలో 120 డిపార్టుమెంట్లలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల్లో బదిలీపై ఎక్కడికి వెళ్లాల్సి వస్తుందోననే టెన్షన్ వాతావరణం నెలకొంది. జిల్లా పరిషత్, డిఇఒ, డిఎంఒ, డ్వామా, మెప్మా మొదలగు రంగాలతోపాటు ఇతర రంగాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న ఉద్యోగుల పెద్దఎత్తున బదిలీ కానున్నారు. ఇందులోభాగంగా ఈనెల 27 నాటికి మూడు రకాల ఆప్షన్లను ఎంపిక చేసుకోవాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో జిల్లా కేంద్రంలో పని చేసే పలువురు ఉద్యోగులు సమీప, సురక్షిత ప్రాంతాలకు బదిలీ చేయించుకునేందుకు పైరవీలను అశ్రయిస్తున్నారు. రాజకీయ ప్రాపకాన్ని ఆశ్రయించి తమకు కావాల్సిన చోటికి బదిలీ చేయించుకు నేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పలువురు ఉద్యోగులు రాజకీయ సిఫారసులు చేయించుకుని తమకు అవసరమైన ప్రాంతాలకు బదిలీ చేసుకుంటున్న సంగతి తెలిసిందే. రాజకీయ పైరవీలతో సురక్షిత ప్రాంతాన్ని దక్కించుకున్న ఉద్యోగులు రాజకీయ నాయకుల అవసరాలకు అనుగుణంగా నడుచు కోవాల్సి వస్తోందనే అంశాన్ని గమనంలో పెట్టుకోవాల్సి ఉంది. జిల్లా పరిషత్‌లో సుమారు 1000 మంది ఉద్యోగులు ఉన్నారు. వీరిలో సుమారు 250 మంది ఉద్యోగులకు బదిలీలకు అవకాశం ఉంటుంది. ఇదేతరహాలో మిగిలిన విభా గాల ఉద్యోగులకు బదిలీలు తప్పడం లేదు. బదిలీల్లో రాజకీయ సిఫారసుల ప్రభావాల ఫలితంగా నిజాయితీగా బాధ్యతలు నిర్వహించడం కష్టమనే వాదన వినిపిస్తోంది. ఇప్పటికైనా జిల్లాలోని 120 డిపార్టుమెంట్లలో గ్రూప్-1 నుంచి గ్రూప్-4 వరకు వివిధ సెక్షన్ల ఉద్యోగుల్లో పలువురు రాజకీయ పైరవీలను ఆశ్రయించడం అవాంఛనీయం. నిజాయితీగా సీనియారిటీ ప్రాతిపదికన తమకు కేటాయించిన ప్రాంతంలో విధులు నిర్వహిస్తే పారదర్శకంగా విధులు నిర్వహించే అవకాశం ఉంటుంది. రాజకీయ పైరవీలతో సురక్షిత ప్రాంతాన్ని దక్కించుకున్న ఉద్యో గులు పారదర్శకంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడం కష్టమనే సంగతిని గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు. 2024లో ప్రథమార్థంలో రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పైరవీల బాటపట్టిన ఉద్యోగులకు కత్తిమీద సామును తలపించే పరిస్థితిని ఎదుర్కోవాల్సి ఉంటుందని గ్రహించాలి.

రహదారుల భద్రతకు పటిష్ట చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

ప్రజల ప్రాణ భద్రత మనందరి సామాజిక బాధ్యత అని, ఆ దిశగా జిల్లాలో రహదారుల భద్రత కోసం పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు సంబంధితాధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యధిక శాతం రోడ్డు ప్రమాదాల కారణంగానే ప్రజల ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. జనాభాతో పాటు వాహనాల వినియోగం కూడా పెరుగుతున్న నేపథ్యంలో. రవాణా శాఖ, అనుబంధ శాఖల అధికారులు రహదారుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి వాహన ప్రమాదాలను అరికట్టే దిశగా భద్రత చర్యలు చేపట్టాలని సూచించారు. వచ్చే నెలలో పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో అన్ని విద్యాసంస్థలకు సంబంధించిన వాహనాల కండీషన్‌ను తనిఖీ చేసి.. ఫిట్‌నెస్ బాగుంటేనే నిర్వ హణకు అనుమతించాలని రవాణా శాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో బ్యారికెడ్, స్టాపర్స్, ప్రమాద సంకేత సూచికలను పొందుపరచాలని పోలీసు, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయాల్లో 108 వాహన సేవలు సకాలంలో అందేలా సంబందిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రయివేటు, ట్రాన్స్‌పోర్టు వాహనాల వేగాన్ని నియంత్రించేలా, అలాగే ఫోర్ లైన్ రోడ్లలో కుడివైపు లైన్‌లో మాత్రమే వాహనాలు వెళ్లేలా, వాహనదారుల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్ర మంలో కమిషనర్ ప్రవీణ్ చంద్, ఎఎస్‌పి తుషార్ డూడీ, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కమిటీ సభ్యులు ఆర్‌టిఒ, ఇన్‌ఛార్జి డిటిసి సుశీల, ట్రాఫిక్ పోలీసు అధికారులు, ఎంవిఐలు, డిఎంహెచ్ఒ డాక్టర్ ఖాదర్ వలీ, రిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్, ఆర్ అండ్ బి, విద్యుత్ శాఖల ఎస్ఇలు, మున్సిపల్ కమిషనర్లు, నేషనల్ హై వేస్ అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

సంక్షేమ హాస్టళ్లలో ఆరోగ్యకర భోజనం

విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లను అన్ని రకాల వసతులు, హంగులతో తీర్చిదిద్దడంతో పాటు పిల్లలకు శుచి, శుభ్రతతో ఆరోగ్యకరమైన భోజనాన్ని అందించాలని కలెక్టర్ వి. విజయ రామరాజు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో సాంఘిక సంక్షేమ శాఖ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహాల్లో అన్నిరకాల మౌలిక వసతుల కల్పనపైకలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ శాఖ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో, వివిధ ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కెజిబివి పాఠశాలలో పని చేస్తున్న వంట మనుషులకు వృత్తి నిర్వహణలో నైపుణ్య శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఆర్తిహోమ్ ఫౌండర్ సంధ్య పుచ్చలపల్లి, కార్యదర్శి దుర్గాకుమారి బోయపాటి పర్యవేక్షణలో శిక్షణ ఇవ్వడానికి ముందుకొచ్చారని తెలిపారు. జిల్లాలో పని చేస్తున్న 317 వంట మనుషులకు నాలుగు దశల్లో శిక్షణ కార్యక్రమన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ కార్యక్రమం డిఆర్‌డిఎ మహిళా సమాఖ్య భవనంలో వచ్చే నెల 1 నుంచి శిక్షణ నిర్వహిస్తామన్నారు. సమనేశంలో ఒఎస్‌డి రఘునాథ్, సాంఘిక సంక్షేమ శాఖ, సంయుక్త సంచాలకులు, వి.జయప్రకాష్, ఆర్తి హోమ్ ప్రతినిధులైన ప్రాజెక్ట్ డైరెక్టర్ పోదిపిరెడ్డి ప్రభు పాల్గొన్నారు.

ప్రాధాన్యత భవనాలు పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

వారానికి 60 భవనాల చొప్పున ప్రాధాన్యత రంగాలకు సంబంధించిన అన్ని రకాల భవనాల నిర్మాణాలను సెప్టెంబరు చివరి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ వి.విజయ్ రామారాజు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ స్పందన హాలులో సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న ప్రయారిటీ బిల్డింగ్ నిర్మాణ పనుల పురోగతిపై పిఆర్ ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో నిర్మిస్తున్న సచివాలయ భవనాలు, ఆర్‌బికెలు, డిజిటల్ లైబ్రరీలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు తదితర ప్రాధాన్యత నిర్మాణాలను అన్నింటినీ వారానికి 60 చొప్పున స్టేజి కన్వర్షన్ చేసి బేస్ మెంట్ పూర్తి చేసిన అన్నింటినీ సెప్టెంబరు మాసం చివరి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ నాణ్యతలో సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సాంఘిక సంక్షేమ హాస్టల్ బిల్డింగులలో చేపట్టిన 57 రకాల అభివృద్ధి పనులను ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి పూర్తి చేయన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్ఇ శ్రీనివాసుల రెడ్డి, జిల్లా వ్యాప్తంగా ఉన్న పిఆర్ డిఇలు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఎఇలు పాల్గొన్నారు. **గృహనిర్మాణ పనుల్లో పురోగతి సాధించాలి..** నిర్దేశిత లక్ష్య సాధన దిశగా పేదలందరికీ ఇళ్లు పథకం అమలులో ప్రతి అంశంలోనూ పురోగతి సాధించాలని కలెక్టర్ వి. విజయ్ రామరాజు క్షేత్రస్థాయి ఇంజినీర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ విసి హాలులో హౌసింగ్ పీడీ కృష్ణయ్యతో కలిసి జగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహ నిర్మాణ పనుల పురోగతి, మౌలిక వసతులు, జగనన్న సంపూర్ణ గృహహక్కు, అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు తీరు, పురోగతి తదితర అంశాలతో కూడిన ఎజెండాలపై హౌసింగ్ ఇంజినీరింగ్ అధికారులతో నేరుగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గృహ నిర్మాణ శాఖ ఇంజినీరింగ్ అధికారులు హౌసింగ్ లక్ష్య సాధన కోసం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టి అమలు చేస్తున్న సేవలు, సంక్షేమ పథకాలు.. ప్రజలకు సంతృప్త స్థాయిలో అందాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు అందరూ సమన్వయంతో, నిబద్ధతతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డిఇలు, ఎఇలు, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం

కడప అర్బన్ : లైఫ్ లైన్ ఆసుపత్రి అధినేత డాక్టర్ షేక్.రబ్బానీ నగరంలోని ఏడు రోడ్ల సర్కిల్ వద్ద వేసవి దాహాన్ని తీర్చేందుకు ప్రజల సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పిహెచ్‌డిలో ప్రవేశాలకు దరఖాస్తులు

కడప అర్బన్ : వైవీయూలో పిహెచ్‌డి ప్రవేశాల కోసం యూనివర్శిటీ గ్రాంట్ కమిషన్ నిర్వహించే జాతీయ స్థాయి పరిశోధన పరీక్షలలో అర్హత సాధించిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు రిజిస్ట్రార్ వై.పి.వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యుజిసి-నెట్, సిఎస్ఐఆర్, నెట్-సిఇఇడిలో ఫెలోషిప్/స్కాలర్‌షిప్ కు అర్హత సాధించిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. దరఖాస్తులు జూన్ 12 వరకు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

'ఖేలో ఇండియా' పోటీలకు వైవీయూ క్రీడాకారులు

కడప అర్బన్ : ఉత్తర ప్రదేశ్‌లోని లక్నో, జిబి నగర్‌లో ఈ నెల 29 నుంచి ప్రారంభమయ్యే ఖేలో ఇండియా యూనివర్శిటీ క్రీడలకు వైవీయూ క్రీడాకారులు పయనమ్యారని స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ కొవ్వూరు రామసుబ్బారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైవీయూ క్రీడాకారులు వెయిట్ లిఫ్టింగ్, బొర్నలి బోరాలు అలాగే అథ్లెటిక్స్, హైజంప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులు పతకాలు సాధించి తిరిగి రావాలని పేర్కొన్నారు.

మహిళా రెజ్లర్ల పోరాటానికి మద్దతు

కడప అర్బన్ : దేశ రాజధాని ఢిల్లీలో నిరసన తెలుపుతున్న మహిళా రెజ్లర్ల పోరాటానికి మద్దతు ఇస్తున్నట్లు కడప డివిజన్ ఎల్‌ఐసి ఉద్యోగుల సంఘం శ్రామిక మహిళా విభాగం కన్వీనర్ అమీనా పర్వీన్, కో-కన్వీనర్లు శ్రీవాణి, వసుప్రద, పద్మజాలత ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. లైంగిక వేధింపులకు పాల్పడిన ఎంపీ బ్రిజ్ భూషణ్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. దేశానికి ఎన్నో కీర్తి పతకాలు సాధించిపెట్టిన, ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చిన మహిళా రెజ్లర్లు లైంగిక వేధింపులకు గురి కావడం బాధాకరమని పేర్కొన్నారు. నెల రోజులుగా మహిళలు రోడ్డెక్కి జంతర్ మంతర్ దగ్గర ఆందోళన చేస్తున్నా పట్టించుకోకుండా, నీరు, విద్యుత్ వంటి ప్రాథమిక సౌకర్యాలు కూడా నిరాకరించడం సిగ్గుచేటని తెలిపారు. తక్షణం ఎంపిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

సంఘం బలోపేతానికి కృషి చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్


శిక్షణను పరిశీలిస్తున్న రీసోర్స్ పర్సన్ చంద్రశేఖరరావు

స్వయం సహాయక సంఘ సభ్యుల జీవనోపాధిని మెరుగుపరచడానికి సంఘం బలోపేతానికి ఆర్‌పిలు నిత్యం కృషి చేయాలని జిల్లా రీసోర్స్ పర్సన్ గద్దె చంద్రశే ఖరరావు అన్నారు. శుక్రవారం నిహార్ స్కిల్ అకాడమిలో రెసిడెన్షియల్ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, బాధ్యత యుతంగా పని చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను సంఘ సభ్యులు వివరించారు. విధులను సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో డిఆర్‌పిలు జోసెఫ్, శోభబాయ్, ఆర్‌పిలు, సిబ్బంది పాల్గొన్నారు.

డిఇఒకు వినతి పత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉద్యోగోన్నతలు మాన్యువల్‌గా నిర్వహించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యాశాఖలో నిర్వహిస్తున్న ఉద్యోగన్నతుల ప్రక్రియను వెబ్ కౌన్సెలింగ్ ద్వారా కాకుండా మాన్యువల్‌గా నిర్వహించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు. శుక్రవారం వారు డిఇఒ రాఘవరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాశాఖ హడావిడిగా తీసుకునే వింత నిర్ణయాల వల్ల ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని వారు తెలిపారు. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా ఉద్యోగోన్నతలు నిర్వహించడం వల్ల ఉపాధ్యాయులు ఏ ప్రాంతానికి వెళ్లాల్సి వస్తుందోనన్న భయాందోళనలతో ఉద్యోగోన్నతులు నిరాకరిస్తున్నారని తెలిపారు. సాక్షాత్తు విద్యా శాఖ మంత్రి ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో మాన్యువల్ కౌన్సిలింగ్ ద్వారా ఉద్యోగోన్నతలు నిర్వహిస్తామని హామీ ఇచ్చినప్పటికీ విద్యాశాఖ ఉన్నతాధికారులు ఈ విషయంలో అత్యుత్సాహం ప్రదర్శిస్తూ వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించడానికి సన్నాహాలు చేస్తూ ఉపాధ్యాయులకు తీరని నష్టాన్ని చేకూరుస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు మాన్యువల్ కౌన్సిలింగ్ ద్వారా ప్లేసులు చూపిస్తూ పదోన్నతులు నిర్వహించాలని తెలిపారు. ఈ విషయమై డిఇఒ రాఘవరెడ్డి సమస్యను ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కారం కోసం కృషి చేస్తానని యుటిఎఫ్ నాయకులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు రవికుమార్, జిల్లా ట్రెజరర్ దావుద్దీన్, నాయకులు కరీముల్లా, కిరణ్ కుమార్, శ్యాంసుందర్, ప్రకాష్, సిద్దయ్య పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి : వ్య.కా.స

పెండ్లిమర్రి : ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 29న కలెక్టరేట్ వద్ద నిర్వహించబోయే ధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి. అన్వేష్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొనాయిపల్లె, సంగటిపల్లె, మిట్టమీదపల్లె గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు ఏళ్ల తరబడి ఇస్తున్న సమ్మర్ అలవెన్సులు నిలిపేయడం దారుణమన్నారు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా కూలి రూ. 600కు పెంచాలన్నారు. ప్రతి కుటుంబానికీ 200 రోజులు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. వందరోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలకు పనిముట్లు ఇవ్వాలన్నారు. గతంలో ఇస్తున్న సమ్మర్ అలవెన్స్ నిలిపివేయడం వల్ల ఉపాధి కూలీలు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. మస్టర్‌ను పాతపద్ధతిలోనే తెలుగులో అమలు చేయాలని పేర్కొన్నారు. సెల్ యాప్‌లో ఫొటోలు, మస్టర్ ఫీడ్ చేసుకోవాలంటే మేట్లను తిరిగి నియమించాలన్నారు. మేట్లను తొలగించడం వల్ల ఫీల్డ్ అసిస్టెంట్ ల పైన పని భారం పెరుగుతుందన్నారు. చేసిన పనులకు ప్రతి శనివారమూ డబ్బులు చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు మల్లేష్, రఘు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

2న జాబ్ మేళా

కడప అర్బన్ : నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో జూన్ 2న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఐటిఐ ఎడి చిన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఐటిఐలో జాబ్ మేళా ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. 16 ప్రముఖ కంపెనీల నుంచి ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. నిరుద్యోగ యువత ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు తీసురావాలని పేర్కొన్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

పట్టుబడిన ఆటో

చింతకొమ్మదిన్నె : అనుమతులు లేకుండా మట్టిని, గ్రావెల్ తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ గంగయ్య పేర్కొన్నారు, శుక్రవారం మండల పరిధిలోని స్థానిక కొప్పర్తి చెరువులో అక్రమంగా నల్ల తుమ్మ చెట్లను నరికి తరలిస్తున్న ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఆటోను అడ్డుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో స్థానిక విఆర్‌ఒ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాధికారం కోసం ఉద్యమించాలి

బహుజనుల విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు జె.వి.కృష్ణయ్య

ప్రజాశక్తి - కడప అర్బన్

బహుజనులు రాజ్యాధికారం కోసం ఉద్యమించాలని బహుజనుల విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు జె.వి.కృష్ణయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో సిఐటియు జిల్లా కార్యాలయంలో బడుగు, బలహీన వర్గాల జిల్లా స్థాయి ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక గౌరవం, ఆర్థిక న్యాయం ప్రజాస్వామ్యానికి పునాదులని పేర్కొన్నారు. మనకు పుట్టుకతో సామాజిక వెనుకబాటుతనం అంటగడుతున్నారని తెలిపారు. ఈ సామాజిక వెనుకబాటుతనం కారణంగానే మనం అణిచివేతకు, అగౌరవానికి గురవుతున్నామని చెప్పారు. మన గౌరవం కోసం పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. మనం చేసే ఈ పోరాటం గెలవడం కోసమే కాదు, భావితరాలను బతికించడం కోసం అనే సత్యాన్ని మనం గ్రహించాలని కోరారు. సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందిన వర్గాలు వాళ్ల ఆధిపత్యం నిలుపుకోవడం కోసం నాలుగు శాతం సునాయాసంగా చేతులు కలుపుతున్నారని పేర్కొన్నారు. 85 శాతం జనాభా ఉన్న మనం సామాజిక గౌరవం సాధించమే తక్షణ కర్తవ్యంగా భావించాలని చెప్పారు. రాజ్యాధికారం లక్ష్యంగా బహుజనులు పని చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రముఖ న్యాయవాది కట్ల వేణుగోపాలకృష్ణ, ప్రొఫెసర్ తోట కోటేశ్వరరావు, హేతువాద సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ అశోక్ కుమార్, సి.ఆర్.వి.ప్రసాదరావు, బిసి సంఘం రాష్ట్ర కార్యదర్శి అవ్వారు మల్లికార్జున, ఎస్‌టి నాయకులు శ్రీనివాసులు, కులాంతర వివాహాల వేదిక నాయకులు పగడాలయ్య, ముస్లిం మైనార్టీ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు దస్తగిరి, బుద్దిస్ట్ సొసైటీ కల్చర్ కుమారస్వామి, బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి గురప్ప, ఆప్ నాయకులు డాక్టర్ శ్రీనివాసులు, సిపిఎం, సిపిఐ నగర కార్యదర్శులు రామమోహన్, వెంకటశివ, సిపిఐ ఎంఎల్ నాయకులు డబ్బ్యా రాము, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు జె.వి.కృష్ణయ్య

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు

చదువే ఉన్నతుడిని చేస్తుంది

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

చదువు ద్వారానే ఉన్నతుడిని చేస్తుందని విశ్రాంత తెలుగు పండితుడు భాస్కర్‌రాజు, వైమానిక దళ అసిస్టెంట్ ఇంజినీర్ వెంకటకొండయ్య అన్నారు. స్థానిక రామేశ్వరం బాలబాలిక గ్రంథాలయం ఆధ్వర్యంలో వసంతపేట ఉన్నతపాఠశాలలో శుక్రవారం సమ్మర్‌క్యాంప్ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయత్నం పౌరుష లక్షణమన్నారు. ప్రయత్నం ఆశించక చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే ఫలితం తప్పక సిద్ధిస్తుందన్నారు. అనంతరం విద్యార్థుల చేత పాటలు పాడించి, డ్యాన్సులు చేయించారు. యోగా టీచర్ వెంకటసుబ్బమ్మ విద్యార్థులు యోగా నేర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రహీం సాహెబ్, ఉన్నత పాఠశాల సిబ్బంది రెహెమాన్‌ఖాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

దువ్వూరు : ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లాలో 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 550 పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు, ఇంటర్ పరీక్షల్లో 950 పైగా మార్కులు సాధించిన రెడ్డి విద్యార్థిని, విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందిస్తున్నట్లు ఎపి రెడ్డి సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నారుపల్లె జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సెంట్రల్ స్కూల్లో 10వ తరగతి చదివిన విద్యార్థులకు మాత్రం 500 ఆ పైగా మార్కులు సాధిస్తే ప్రతిభా పురస్కారాలు పొందడానికి అర్హులవుతారు అన్నారు. కార్పొరేట్ కళాశాలలో చదివిన వారికి పునస్కారాలు అందుకోవడానికి అర్హులు కారన్నారు. కేవలం పేద, మధ్య తరగతి రెడ్డి పిల్లలను దృష్టిలో ఉంచుకొని నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రతిభ పురస్కారాలకు దరఖాస్తు చేసుకునే వారందరూ తమ మార్కుల జాబితా, ఆధార్ కార్డు, రెండు పాస్ పోర్టు సైజు ఫొటోలు పంపాలని తెలిపారు. ముందుగా వాట్సప్ నెంబర్ల ద్వారా పంపి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. 8341736160, 850045500లలో సంప్రదించాలన్నారు ప్రతిభ పురస్కారాలను అందించేందుకు వ్యవస్థాపక అధ్యక్షులు, రాష్ట్ర కమిటీ సభ్యులు హాజరవుతారని జగన్ మోహన్ రెడ్డి తెలిపారు.

పాదరక్షలు, ఊత కర్రలు పంపిణీ

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని ఇండియా సిమెంట్స్ యాజమాన్యం పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలకు శుక్రవారం పాదరక్షలు, ఊత కర్రలు ఉచితంగా పంపిణీ చేశారు. పేదలకు కర్మాగార సేవా కార్యక్రమంలో భాగంగా 108 మందికి పాదరక్షలు,108 మంది వృద్ధులకు ఊత కర్రలు ఉచితంగా పంపిణీ చేసినట్లు ప్లాంట్ హెడ్ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో పరిశ్రమ యాజమాన్యం నాగిరెడ్డి,సుధాకర్ రెడ్డి, శరవనన్, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

జెసి, ఆర్‌డిఒ న్యాయం చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న చంద్ర ఓబుల్‌రెడ్డి

చెన్నూరు మండలం, చిన్న మాసపల్లె గ్రామ పొలంలోని సర్వే నంబర్ 407/2 ఉన్న 5.09 ఎకరాల భూమి విషయమై జెసి, ఆర్డీవో తమకు న్యాయం చేయాలని స్థల యజమానులు చంద్రఓబుల్ రెడ్డి, రాజారెడ్డి కోరారు. శుక్రవారం చెన్నూరు బస్టాండ్‌లోని వారి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది దొంగ డాక్యుమెంట్ సృష్టించి 2.09 ఎకరాల స్థలం తమదంటూ కింది స్థాయి ఉద్యోగులను అధికారులను తప్పుదోవ పట్టించాలని చెప్పారు. 2022, నవంబర్ 11న కైరునిస బేగం నుంచి తాము కొనుగోలు చేశామని తెలిపారు. జెసి విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

హాస్టల్లో అన్నదానం

ప్రజాశక్తి- కడప అర్బన్

అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్ కువైట్, మదర్ థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యల్లరాతి దీక్షిత్ కుమార్ జ్ఞాపకార్థం వారి తల్లిదండ్రులు అన్నమయ్య జిల్లా రాజంపేట సరస్వతి పురానికి చెందిన యల్లరాతి రమేష్, సుకన్య కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో కడప నగరంలోని అర్బన్ హాస్టల్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మదర్ థెరిసా సేవా సమితి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజయ్ కుమార్, మరో అతిథి శిరీష చేతులు మీదుగా అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ దీక్షిత్ కుమార్ చిన్న వయసులోనే కానరాని లోకాలకు వెళ్లడం బాధాకరమన్నారు. శిరీష మాట్లాడుతూ బాబు చనిపోవడం ఆ తల్లిదండ్రులకు తీరనిలోటన్నారు. మనో ధైర్యాన్ని ఇవ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రసాద్ పాల్గొన్నారు.

2న పాత కొయ్యల వేలం

ప్రజాశక్తి - కడప

నగరంలోని జువైనల్ హోమ్ (ప్రభుత్వ బాలుర గృహం) ఆవరణలో ఉన్న పాత కొయ్యలను జూన్ 2న బహిరంగ వేలం వేయనున్నట్లు జువైనల్ హోమ్ సూపరింటెండెంట్ వీరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ బాలుర గృహంలో పాత టేకు కొయ్యలు, వంట చెరుకు కొయ్యలను జిల్లా అటవీ శాఖ అధికారి, కడప వారు వాటి విలువను రూ. 4,58,490 గా నిర్ణయించామన్నారు. డిమాండ్ డ్రాఫ్ట్ 2న సాయంత్రం 3:00 గంటలకు హోమ్ కార్యాలయానికి రావాలన్నారు. బహిరంగ వేలంలో ఎక్కువ వేలం పాట పాడిన వారు అప్పుడే ఆ మొత్తములో 1/4 వంతు చెల్లించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9100045405లో సంప్రదించవచ్చన్నారు.

ఎన్‌టిఆర్‌కు భారతరత్న ఇవ్వాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

విశ్వ విఖ్యాత నటసార్వాభౌముడు ఎన్‌టి రామారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ఇవ్వాలని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్నూరు అక్బర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పాతబస్టాండ్‌లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌టిఆర్ నటుడిగా, నాయకుడిగా ప్రజల ఆధరాభిమానాలు పొందారని పేర్కొన్నారు. టిడిపి స్థాపించి అనతి కాలంలోనే సిఎం అయ్యారని తెలిపారు. కుల,మతాల సామరస్యం కోసం అహర్నిశలు కృషి చేసిన మొదటి వ్యక్తి ఎన్‌టిఆర్ అని చెప్పారు. భారత రత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రోడ్డును కప్పేసిన ముళ్లపొదలు

పొంచి ఉన్న ప్రమాదం
- మలుపుల వద్ద ముళ్ల పొదలు

ప్రజాశక్తి-పెద్దముడియం

మండల పరిధిలోని కొండ సుంకేసుల గ్రామ సమీపంలో ఉన్న మలుపు వద్ద ముళ్లపొదలు ఏపుగా పెరిగి రోడ్డును కప్పేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం వాటిల్లుతుందోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఎదురెదురుగా వాహనాలు కన్పించకపోవడంతో ఇప్పటికే పలు ప్రమాదాలు చోటు చేసుకుని పలువురు గాయాలపాలయ్యారు. దిగువకవటాల గ్రామ సమీపంలోనూ ఇదే పరిస్థితి. రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరగడంతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పలమార్లు ప్రజలు సంబంధితాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం శోచనీయం. రాత్రుళ్లు అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఎదురెదురుగా వచ్చే వాహనాలు గమనించక పలువురు వాహనచోదకులు ప్రమాదాలకు గురైన సంఘటనలు అనేకం. ఇప్పటికైనా సంబంధితాధికారులు స్పందించి రోడ్డుకు ఆటకంగా మారిన ముళ్లపొదలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

నామ మాత్రంగా ఉన్న చలివేంద్రం

చలివేంద్రం నిర్వహణ గాలికి

ప్రజాశక్తి - ముద్దనూరు

వేసవిలో ప్రజలు, బాటసారులు, ఫిర్యాదుదారుల దాహార్తిని తీర్చేందుకు ఎస్‌పి అన్బురాజన్ ఆదేశాల మేరకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం దిష్టిబొమ్మలా మారింది. ప్రారంభం రోజు మినహా మిగిలిన రోజుల్లో చలివేంద్రం నామమాత్రంగా మారింది. కేవలం కుండలు తప్ప వాటిలో చుక్క నీరు కూడా కన్పించడం లేదు. ప్రజలు ఎంతో ఆశగా చలివేంద్రం వద్దకు నీళ్లు తాగుదామని వెళ్తే ఖాళీ కుండలు కన్పించడంతో తీవ్ర నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఎస్‌పి ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీసు శాఖ స్పందించి వేసవి ముగిసే వరకు చలివేంద్రాన్ని సక్రమంగా నిర్వహించాలని కోరుతున్నారు.

ఎస్‌సి, ఎస్‌టి కేసు విచారణ

ప్రజాశక్తి - ముద్దనూరు

ఈనెల 7న స్థానిక అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎస్సీ ఎస్టీ కేసు సంబంధించి శనివారం సిఐ నరేష్ బాబుతో కలిసి జమ్మలమడుగు డిఎస్‌పి నాగరాజు శనివారం విచారణ చేపట్టారు. సిఐ నరేష్ బాబు తెలి పిన వివరాల ప్రకారం. స్థానిక కొత్తకోటాల వీధిలో నివాసముంటున్న నాగేశ్వరి ప్రొద్దుటూరుకు చెందిన స్పందన స్ఫూర్తి ఫైనాన్స్ వారి వద్ద రూ. లక్ష 50వేలు రుణం తీసుకుందన్నారు. రుణం మొత్తం 26 కంతుల్లో చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారని చెప్పారు. 3 నెలలుగా కంతులు కట్టక పోవడంతో సదరు ఫైనాన్స్‌కు చెందిన అధికారి మస్తాన్ రెడ్డి మరి కొందరు సిబ్బంది నాగేశ్వరి ఇంటి వద్దకు వెళ్లితీసుకున్న రుణాన్ని చెల్లించాలని దుర్భా షలాడుతూ కులం పేరుతో దూషించారని భాదితురాలు స్థానిక పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసిందన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అందులో భాగంగా డిఎస్పీ విచారణ చేపపట్టారు.

క్రైం కార్నర్

మృతిచెందిన నాగశేఖర్

కారు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధి లోని ఆంజనేయపురం సమీపంలో కడప-కర్నూలు జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన నాగశేఖర్ (44) అక్కడి కక్కడే మృతి చెందాడు. స్థాని కులు, పోలీసులు కథనం మేరకు.. ఆంజనేయపురం గ్రామానికి చెందిన నాగశేఖర్ ద్వి చక్రవాహనంపై సమీప పొలంలో నుంచి పశుగ్రాసాన్ని తీసుకొని ఇంటికి వచ్చేందుకు జాతీయ రహదారి దాటుతుండగా, కడప వైపు నుంచి మైదుకూరు వెళుతున్న కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్యతో పాటు ఒక కుమారుడు ఒక కుమార్తె ఉన్నారు. అతని మృతితో ఆంజనేయ పురం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నామని పోలీసులు తెలిపారు.

బాకీ విషయమై ఘర్షణ : ఒకరికి గాయాలు

పులివెందుల రూరల్ : డబ్బులు బాకీ విషయంపై శుక్రవారం పట్టణంలో ఘర్షణ చోటుచేసుకుంది. ఈ సంఘటనలో గణేష్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలో గణేష్‌కు జనార్ధన్ జనార్ధన్ అనే వ్యక్తి డబ్బులు ఇవ్వాల్సి ఉంది. కొద్దిరోజుల కిందట డబ్బులు వసూలు నిమిత్తం జనార్ధన్ బండిని గణేష్ తీసుకెళ్లాడు. శుక్రవారం డబ్బులు కట్టి బండి విడిపించుకునేందుకు గణేష్ వద్దకు వెళ్లారు. ఈ నేపథ్యంలో వీరిద్దరి మధ్య మాటా మాటా పెరిగి తన బండిలో ఉన్న పాత సురకత్తితో జనార్ధన్ గణేష్‌పై దాడి చేశాడు. సంఘటనలో తీవ్రంగా గాయపనడిన బాధితుడిని స్థానికులు పులివెందుల ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ హుసేన్ తెలిపారు.

బావిలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చక్రాయపేట (వేంపల్లె)

చక్రాయపేట మండలంలోని కుప్పం పంచాయతీ, బుర్జుపల్లె గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు పడి వెంకట సుబ్బారెడ్డి అనే వ్యక్తి మృతి చెందాడు. శుక్రవారం పిల్లలకు ఈత నేర్పించేందుకు బావిలోకి దిగాడు. ఈత నేర్పించిన తర్వాత అతను మళ్లీ బావిలోకి దిగినట్లు మృతున్ని బంధువులు తెలిపారు. బావిలోకి దిగిన వెంకట సుబ్బారెడ్డి ప్రమాదవశాత్తు పూడికలో ఇరుక్కున్నాడు. బావి గడ్డపైన ఉన్న పిల్లలు స్థానికులకు సమచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకుని అతడి కోసం బావిలో వెతికారు. దొరక్కపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి తెలపడంతో వారు అక్కడికి వెళ్లి బావిలో ఉన్న వెంకట సుబ్బారెడ్డి మృతదేహాన్ని బయటికి తీసి ఆసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఎత్తిపోతల' పనులకు రైతులు సహకరించాలి

సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్ర మోహన్

ప్రజాశక్తి - వేంపల్లె

ఎత్తిపోతల పథకం పనులకు సంబంధించి భూ సేకరణకు రైతులు సహకరించాలని జిఎన్ఎస్ఎస్ టిజిపి యూనిట్ -2 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రమోహన్ కోరారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలోని సభా భవనంలో భూసేకరణపై రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ ఎస్ఎస్ ఎత్తిపోతల పథకం కింద కత్తులూరు పంపుహౌస్ నుంచి పైపు లైన్ వేసేందుకు చింతలమడుగు పల్లె పరిధిలోని భూముల్లో స్థల సేకరణ చేస్తున్నట్లు చెప్పారు. ఎత్తిపోతలకు సంబంధించిన పైపు లైన్ వేసేందుకు 41.47 ఎకరాల భూమి అవసరం ఉన్నట్లు చెప్పారు. 67 మంది రైతుల నుంచి భూసేకరణ చేస్తున్నట్లు చెప్పారు. భూ చట్టం ప్రకారం రైతులకు ఎకరాకు 11.68 లక్షలు నష్ట పరిహారం చెల్లిస్తామని చెప్పారు. పంట భూముల్లో చెట్లు, పైపులైన్లు ఉంటే అదనంగా పరిహారం చెల్లిస్తామని చెప్పారు. రైతులు భూసేకరణకు సహకరించాలని కోరారు. వేంపల్లె ప్రాంతంలో భూముల ధరలు ఎక్కువగా ఉన్నాయని కాబట్టి ఎకరాకు రూ. 30 లక్షల ఇవ్వాలని రైతులు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను కోరారు. పైపులైన్ భూమి మధ్యలో పోవడం వల్ల పంటలు సాగు చేసుకున్న రైతులకు చాలా ఇబ్బందులు ఉన్నాయని రైతులు వాపోయారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పరిహారం ఇవ్వడం జరుగుతుందని అయినప్పటికీ ప్రతి రైతుకు అధికంగా పరిహారం ఇచ్చేందుకు కృషి చేస్తామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హామీ ఇచ్చారు. పైపు లైన్ వేసిన తర్వాత మళ్లీ పైపులైన్లు పూడ్చి వేస్తారన్నారు. రైతులు సహకరిస్తే నష్ట పరిహారం మంజూరు చేసి పనులను ప్రారంభిస్తామని చెప్పారు. తక్కువగా పరిహారం ఇస్తే రైతులు నష్టపోయే అవకాశం ఉందని, మరింత పెంచాలని రైతులు అందరూ మూకుమ్మడిగా కోరడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మల్లికార్జునరెడ్డి, జిఎన్ఎస్ఎస్ జూనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్ రైతులు పాల్గొన్నారు.

మోడీ కోసం పాకులాడడం దురదృష్టకరం
- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

మోడీ ప్రభుత్వం పార్లమెంట్ భవన ప్రారంభోత్సవానికి భారత రాష్ట్రపతిని ఆహ్వానించకుండా అవమానిస్తూ ఉంటే, మరో వైపు ఆంధ్రప్రదేశ్ సిఎం జగన్ రెడ్డి, మాజీ సిఎం చంద్ర బాబు నాయుడు మోడీ ప్రాపకం కోసం పాకులాడడం దురదృష్టకరమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని మోడీకి జగన్ రెడ్డి భజన్ రెడ్డిగా, చంద్రబాబు చెక్క భజన బాబుగా మారరాని తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. వైసిపి ప్రభుత్వం ఒక వైపు ఆర్థిక సంక్షోభంలో కొట్టు మిడుతూ, మరో వైపు అనేక మంది సలహాదారులను నియమిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. మైనారిటీ సంక్షేమ శాఖకు ఇప్పటికే ఇద్దరు సలహా దారులుండగా మళ్లీ మరో ఇద్దరిని ప్రభుత్వం నియమించడం గర్హనీయం అన్నారు సలహాదారుల నియామకం రాజకీయ పునరావాస పథకంగా వైసిపి నాయకులకు, కార్యకర్తలకు ఉపాధి హామీ పథకంగా, జగన్ అస్మదీయులకు దోచి పెట్టే పథకంగా తయారైందని మండిపడ్డారు. అత్తసొత్తు అల్లుడు దానం చేసినట్లు ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కడు దయనీయంగా ఉందని తెలిపారు. రోజూ రిజర్వు బ్యాంకు వద్ద ఓవర్ డ్రాఫ్ పోతుందని అన్నారు. సకాలంలో జీతాలు ఇవ్వక పోవడంతో పాటు కాంట్రాక్టులకు బిల్లులు కూడా చెల్లించడం లేదన్నారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో ఒక్కొక్క సలహాదారునికి నెలకు రూ. 5 లక్షల ఖర్చు చేయడం సమంజసమా అని ఆయన ప్రశ్నించారు. మింగమెతుకు లేదు - మీసాలకు సంపంగి నూనె అన్నట్లు ఉంది జగన్ వాలకమని ఎద్దేవా చేశారు. ఇంత చేసిన సలహాలు ఏమైనా ఇస్తున్నారా అంటే అది కూడ ఏమీ లేదన్నారు. సలహాదారుల నియామకం సమంజసంగా లేదని కోర్టులు వ్యాఖ్యానించిందని, సిఎం జగన్ పట్టించుకోకపోవడం బాధాకరమని చెప్పారు. ఇకనైనా సలహాదారుల నియామకంకు స్వప్తి పలికి ఇప్పటికే నియామకమైన సలహాదారుల నియామకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న ఉత్తన్న, అమర్, సుబ్బరాయుడు, శివ, నాగార్జున పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

అనధికార ఫ్లెక్సీలను తొలగించాలి

మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నజీర్

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

నిబంధలను విరుద్దంగా ఫ్లెక్సీలను తొలగించాలని కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ నజీర్ కోరారు, శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల అనుమతి లేకుండా పట్టణంలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. సహజంగా రాజకీయపార్టీలకు చెందిన ఫ్లెక్సీలు ఒకటి, రెండు రోజుల వరకు అనుమతి ఉంటుందని తెలిపారు. అనంతరం వీటిని తొలగించాల్సి ఉంటుందన్నారు. కానీ పట్టణంలోని ఫ్లెక్సీలు నెలరోజుల పైబడి ఉండడం వల్ల ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యాపారులకు, వాహనదారులకు ఇబ్బందిగా మారుతున్నాయని పేర్కొన్నారు. వీధి మోటులలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం వల్ల అవతలివైపు నుండి వచ్చే వాహనం కనబడడం లేదన్నారు. సమస్యను పరిష్కరించాలన్నారు. పట్టణంలో ప్లాస్టిక్ వాడకం అంతకంతకూ పెరుగుతోందన్నారు. వాతావరణ సమతుల్యత దెబ్బతినడంతో పాటు పశువులు తినడం వల్ల అనారోగ్యానికి గురి అవుతున్నాయన్నారు. వ్యర్థ ప్లాస్టిక్‌ను మురికికాలువలలో పడవేయడం వల్ల డ్రెయినేజీ వ్యవస్థ దెబ్బతింటోందన్నారు. సమస్యలపై అధికారి స్పందించాలని నజీర్ కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు, సైమన్ పాల్గొన్నారు.

విద్యార్హతపై విచారణ చేపట్టాలి : డివైఎఫ్ఐ

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ఇంజినీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న ప్రిన్సిపాళ్ల విద్యార్హతపై విచారణ చేపట్టారని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని జెఎన్‌టియు, వైఎస్ఆర్ హెల్త్ యూనివర్శిటీ పరిధిలోని ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలలో కళాశాలలో నిబంధనలకు విరుద్ధంగా సరైన విద్యార్హత లేని వ్యక్తులను యాజమాన్యాలు ప్రిన్సిపాల్‌గా నియమిస్తున్నాయని తెలిపారు. ఇంజినీరింగ్ ఫార్మసీ కళాశాలపై సమగ్ర విచారణ చేయించి సంబంధిత కళాశాలపై చట్టపరమైన చ్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యం, యాజమాన్యాల బాధ్యత రాహిత్యం మూలంగా విద్యార్థులకు నాణ్యమైన చదువులు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ కాలేజ్ ఫార్మసీ కళాశాలలో తనిఖీలు సందర్భంగా అధికారులు ఇంటర్వ్యూ నిర్వహిస్తే వాటిల్లో కేవలం కొద్ది మందికి మాత్రమే అర్హతను గుర్తిస్తున్నారని తెలిపారు. నిబంధనల ప్రకారం 15 సంవత్సరాల బోధన అనుభవంతో పాటు పిహెచ్‌డి కలిగి ఉంటేనే ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేసేందుకు అర్హులని పేర్కొన్నారు.

చేనేతలను ఆదుకోవాలి

ప్రొద్దుటూరు: కులవృత్తిని నమ్ముకున్న చేనేత కార్మికులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ చేనేత సంఘం రాష్ట్ర అధ్యక్షులు పాలా రామాంజనేయులు, సహాయకార్యదర్శి వెంకటకృష్ణయ్య కోరారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ వెంకటరమణను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ముద్రరుణం ద్వారా రూ.లక్షలు మంజూరు చేయాలన్నారు. మగ్గం నేస్తున్న మహిళలకు బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలన్నారు. 50 ఏళ్ల నిండిన నేతన్నలకు వైఎస్ఆర్ నేతన్న నేస్తం అర్హత కల్పించాలన్నారు. ప్రభుత్వం నిర్మిస్తున్న పక్కాగృహాలకు ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలు కాగా అదనంగా రూ.30వేలు విడుదల చేయాలన్నారు. విద్యుత్ బిల్లులలో 200 యూనిట్లు సబ్సిడీ ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డక్కా ఓబులేసు, మహిళా నాయకులు జ్యోతి, సంజమ్మ, వసంత, సావిత్రి, కమలాదేవి పాల్గొన్నారు.

నేడు చెన్నూరుకు ఎమ్మెల్యే రాక

చెన్నూరు : వాలంటీర్ల సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కమలాపురం శాసనసభ్యులు పోచం రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి రానున్నట్లు ఎంపీడీవో గంగనపల్లి సురేష్, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ తెలిపారు, శుక్రవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వరుసగా మూడో ఏడాది గ్రామ సచివాలయ వాలంటీర్లకు అందించే ఉత్తమ గ్రామ సేవా మిత్ర, సేవా రత్న, సేవ వజ్ర పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే రానున్నట్లు వారు తెలియజేశారు, కార్యక్రమాన్ని స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఉదయం 9:30 గంటలకు (పార్కు నందు) నిర్వహించనున్నట్లు వారు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ వాలంటీర్లతోపాటు, వైసిపి నాయకులు కార్యకర్తలు హాజరుకావాలని వారు తెలియజేశారు చెప్పారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం నందు ఉదయం 11 గంటలకు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఉంటుందన్నారు.

140 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు మంజూరు

ముద్దనూరు : మండలానికి 140 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు మంజూరయ్యాయని వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం ఎఒ క్షేత్ర స్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 40 శాతం రాయితీతో విత్తనాలు అందిస్తుందన్నారు. కదిరి -6 రకం వేరుశనగ విత్తన కాయలు ఒక క్వింటా 9,300 కాగా రాయితీ 3,720 పోను రైతు వాటా 5,580 చెల్లించాలన్నారు. కదిరి లేపాక్షి 18- 12 రకం ఒక క్వింటాలు 8,300 కాగా 3,320 రాయితీ పోను రైతు 4,980 చెల్లించాలన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ తీసుకుని ఆయా రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. ఈనెల 29 నుండి 40 శాతం రాయితీతో విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రక్తదానంతో పునర్జన్మ

జమ్మలమడుగు : తల్లి జన్మని ఇస్తే రక్త దాత పునర్జన్మని ఇస్తాడని మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మన్ రావు తెలిపారు. శుక్రవారం స్థానిక క్యాంబెల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టంగుటూరు పార్వతి అనే మహిళకు ఎబి పాజిటివ్ రక్తం అవసరం కాగా కుటుంబ సభ్యులు మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మన్‌రావుని సంప్రదించారు. వారు వెంటనే స్పందించి మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సభ్యుడు భాస్కర్(ఎఆర్ కానిస్టేబుల్) ఏబి పాజిటివ్ రక్తాన్ని రక్తదానం చేశారు. కార్యక్రమంలో భార్గవ్ సాయి, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మహిళల ర్యాలీ

ఎర్రగుంట్ల : మెప్మా ఆధ్వర్యంలో ప్రపంచ రుతుస్రావ పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణ పరిధిలో మహిళలు ర్యాలీ నిర్వహించారు. మహిళలలో రుతుస్రావం గురించి అవగాహన కల్పించారు. రుతుస్రావ సమయంలో ఉన్న అపోహలు తొలగించారు. 'రైజ్ యువర్ వాయిస్ - బ్రేక్ ది సైలెన్స్' అనే నినాదంతో మెప్మా సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. హెల్త్ క్యాంపులు నిర్వహించి ప్రపంచ ఋతుస్రావ పరిశుభ్రత దినోత్సవ వారోత్సవాల విశిష్టతను మెప్మా సిఒలు వసంత్ రెడ్డి, విమల వివరించారు. కార్యక్రమంలో సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న హోమ్ ఎక్స్‌పో ప్రదర్శన

మదనపల్లె అర్బన్: స్థానిక ప్యారడైజ్ ఫంక్షన్ హాలులో మదనపల్లె అసోసియేషన్ ఆఫ్ లైసెన్స్ ఇంజనీర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హోమ్ ఎక్స్‌పో 2023 (బిల్డింగ్ మెటీరియల్ ప్రదర్శన) ఆకట్టుకుంటున్నట్లు ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జాకీర్ హుస్సేన్ తెలిపారు. హోమ్ ఎక్స్‌పో కార్యక్రమం ఇక్కడ గృహ నిర్మాణాలు చేపట్టే వారికి అవసరమైన అన్ని రకాల వస్తువుల స్టాళ్లతో పాటు ఇంటీరియర్ డెకరేటింగ్ స్టాల్స్ కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గృహ నిర్మా ణానికి సంబంధించి దాదాపు 30 వివిధ రకాల నిర్మాణ, పనిముట్లను ప్రదర్శనలో ఉంచినట్లు చెప్పారు. మొదటిరోజు పట్టణంలోని ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తాము ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకిం చినట్లు తెలిపారు. ఈ ప్రదర్శ రెండు రోజులు పాటు కొనసాగుతుందని, కావున మదనపల్లి పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెం ట్ మహేంద్ర బాబు, ట్రెజరర్ రెడ్డి నాగరాజు, ఇసి మెంబర్ సురేష్ బాబు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

కరాటే క్లబ్ విద్యార్థుల ప్రతిభ అమోఘం

మదనపల్లె అర్బన్: రాయచోటిలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ జిల్లా చీఫ్ కోచ్ షేక్ షఫీని యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎ.ఆర్.సురేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. మదనపల్లె యూత్ కరాటే క్లబ్ విద్యార్థుల ప్రతిభను షఫీ అభినందించారు.సురేష్ నేతృత్వంలో విద్య బోధన, క్రమ శిక్షణ గొప్పగా ఉందని షఫీ కొనియాడారు. సీనియర్ గ్రాండ్ మాస్టర్‌గా మీ సేవలను రాయచోటిలోని విద్యార్థులకు అందించాలని షఫీ కరాటే మాస్టర్ సురేష్‌ను కోరారు. చక్కని నైపుణ్యంతో శిక్షణ ఇవ్వడం చాలా గొప్ప విషయమని అలాంటి కరాటే శిక్షణ రాయచోటిలో కూడా ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా వేసవి శిక్షణ శిబిరంలో ఘనంగా నిర్వహించాలని సూచించారు.

పథకాల అమలులో కీలక పాత్ర

ప్రజాశక్తి జమ్మలమడుగు రూరల్

వాలంటీర్‌ను సన్మానిస్తున్న సర్పంచ్

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు చేయడంతో వాలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని పి. బొమ్మేపల్లి సర్పంచ్ గుణకనపల్లి రామనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బొమ్మేపల్లి సచి వాలయంలో కార్యదర్శి గురు మహేంద్రారెడ్డి ఆధ్వర్యంలో అంబవరం, గండికోట, బొమ్మేపల్లి గ్రామాలలోని వాలంటీర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధులుగా వాలంటీర్లు పనిచేయడం అభినందనీయం అన్నారు. ప్రభుత్వం వీరి సేవలను గుర్తించి అవార్డులతో సత్కరిం చడం గర్వకారణం అన్నారు. పంచాయతీ కార్యదర్శి్డి మాట్లాడుతూ అంబ వరం, గండికోట, బొమ్మేపల్లి గ్రామపంచాయతీలలో 26 మంది వాలంటీర్లు సేవా మిత్రా అవార్డుకు , ఒకరు సేవారత్న అవార్డుకు ఎంపికయ్యారన్నారు. సేవారత్న అవార్డుకు ఎంపికైన కె.నాయబ్ రసూల్ ఆచారికి ప్రభుత్వం రూ. 20, 000, సేవా మిత్ర కు ఎంపికైన వారికి రూ.10,000 అందజేసిందన్నారు. వాలంటీర్ల వ్యవస్థ ఆధునిక సమాజ వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చివరగా సేవారత్న, సేవా మిత్రా అవార్డులకు ఎంపికైన వాలంటీర్లు సచివాలయ అధికారులకు, సర్పం చులకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ కొత్తకుంటపల్లె శ్రీను, గండికోట, అంబవరం, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **పెద్దమడియం :** మండల పరిధిలోని పాలూరులో ఏర్పాటు చేసిన నూతన సచివాలయాన్ని స్థానిక వైసిపి నాయకులు ప్రసాద్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం వాలంటీర్లను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్లు ప్రజలకు సంక్షేమ పథకాలు సకాలంలో అందించి వారి మన్ననలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ జ్యోతి రత్నకుమారి, ఎంపిడిఒ వెంకటరమణయ్య, పాలూరు గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం కార్పొరేట్ స్థాయిలో వసతులు కల్పించి ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, బెల్టు, బూట్లు అందిస్తుందని ఎంఇఒ విజయ్ భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు 14 వేల పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, బెల్టులు, బూట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. మండల వ్యాప్తంగా 44 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిలో 36 ప్రాథమిక, 2 అప్పర్ ప్రైమరీ పాఠశాలలు, 6 ఉన్నత పాఠశాలలున్నాయి. ఇందులో 1నుంచి 10 వరకు 2,767 మంది విద్యార్థులున్నారని, ప్రభుత్వం విడతల వారీగా పుస్తకాలు అందిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్య, భోజనం, యూనిఫాం, పుస్తకాలు, బూట్లు, బెల్టుతోపాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే ఉత్తమ విద్యా బోధన అందిస్తున్నట్లు చెప్పారు. పదిలో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు చెప్పారు.

జమ్మలమడుగు విద్యార్థికి 23వ ర్యాంకు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

భార్గవ నందన్ రెడ్డి

తెలంగాణ ఎంసెట్ ఇంజినీరింగ్ విభాగంలో జమ్మలమడుగు విద్యార్థి కర్రు భార్గవ నందన్ రెడ్డికి 23 వ ర్యాంకు సాధించారు. శుక్రవారం భార్గవ నందన్ తండ్రి కర్రు సంజీవ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఎంసట్‌లో 160 కి 150 మార్కులు సాధించి ఓపెన్ కేటగిరీలో తెలంగాణ స్టేట్ 23వ ర్యాంకు తన కుమారుడికి రావడం ఆనందంగా ఉందన్నారు. జమ్మలమడుగు మండలం పి.బొమ్మేపల్లి గ్రామం రైతు కుటుంబానికి చెందిన వారామన్నారు. తాను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాంట్రాక్ట్ అధ్యాపకుడుగా విధులు నిర్వహిస్తున్నానని తెలిపారు. భార్గవ నందన్ రెడ్డి తల్లి ప్రసన్నకుమారి గృహిణి అన్నారు. భార్గవ్ హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశాడని చెప్పారు. ఇటీవల జెఇఇ మెయిన్స్‌లోనూ 99.6 శాతంలో మంచి ర్యాంక్ సాధించారన్నారు. ఈ సందర్భంగా భార్గవ నందన్ రెడ్డిని బంధువులు, గ్రామస్తులు అభినందించారు.

మటన్ ధరలను పెంచితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - వేంపల్లె

కటిక వ్యాపారులు మటన్ ధరలను అధికంగా పెంచి విక్రయాలు చేపట్టితే కఠిన చర్యలు తీసుకొంటామని పంచాయతీ కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యదర్శికి ప్రజలు మాంసం ధరలపై ఫిర్యాదులు చేయడంతో కటిక వ్యాపారులకు ఇఒ రవిశంకర్‌రెడ్డి కిలో మటన్ రూ.650లకే విక్రయాలు చేయాలని నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాంసం ధరలను అధికంగా పెంచడం వల్ల పేద ప్రజలు మటన్ తినలేక పోతున్నామని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నట్లు చెప్పారు. కాబట్టి కిలో మటన్‌ను రూ 650 కే విక్రయించాలని నోటీసులు ద్వారా తెలియజేశారు. అధిక ధరలకు అమ్మితే తమ దృష్టికి తీసుకొని రావాలని కోరారు.

రహదారి సమస్యను పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి- ఖాజీపేట

మండల పరిధిలోని దుంపలగట్టు టోల్ ప్లాజా వద్ద పనులు ఆల స్యంగా చేస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సమ స్యను పరిష్కరించాలని టిడిపి సీనియర్ నాయకులు రెడ్యం వెంకట సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడప కలెక్టరేట్‌లోని నేషనల్ హైవే పీడీ గోవర్ధన్‌రెడ్డికి గ్రామస్తులతో కలసి వినతి పత్రం అందజేశారు. అనంతరం రెడ్యం మాట్లా డుతూ సర్వీస్ రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, వాహనదారుల అదుపు తప్పి ప్రమాదాలు గుంవుతున్నారని పేర్కొన్నారు. డ్రైన్లు, స్లోప్ ప్రొటెక్షన్ వాల్ లే కపోవడంతో వర్షా కాలంలో బురద నీరు వీధిలోకి వచ్చి చేరుతోందని తెలిపారు. స్పందించిన అధి కారి తానే స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యను పరిష్కరిస్తానని హా మీ ఇచ్చారు. కార్యక్రమంలో సైట్ ఇంజినీర్ సాయి రెడ్డి, టిడిపి నాయకులు దాసరి బాలయాదవ్, నందిరెడ్డి నాగశివారెడ్డి, సాయి కుమార్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE: KADAPA.

O.S.No.367 / 2016

1. Levaku Kondamma, W/o Late L. Subbi Reddy, Aged 56 years, House wife, R/at D.No.90/66, Somavandla Palli, C.K. Dinne Mandal, Kadapa Corporation Limits, Y.S.R. District-516 004.
2. Levaku Penchal Reddy,S/o Late Levaku Subbi Reddy, Aged 33 years, Permanent resident of D.No.90/66, Somavandla Palli, C.K. Dinne Mandal, Kadapa Corporation Limits, Y.S.R. District - 516 004, at present R/at 3400 N Alma School Road, Apt# 1122, Chandler, AZ, USA - 8S224, Rep. by his power of attorney holder, his mother Levaku Kondamma
3. Levaku Penchal Reddy, S/o Late Pedda Narasimha Reddy, Aged 55 years, R/at D.No.90/55, Somavandla Palli, C.K . Dinne Mandal, Kadapa Corporation Limits, Y.S.R. District-516 004.

...Plaintiffs

Vs

1. Levaku Narasimha Reddy, S/o Late Nadipi Narasimha Reddy, Aged 52 years, R/at D.No. 90/232, Somavandla Palli, C.K. Dinne Mandal, Kadapa Corporation Limits, Y.S.R. District - 516 004 **(D2)**.
2. Levaku Krishna Reddy, S/o Late Nadipi Narasimha Reddy, . Aged 45 years, R/at D.No.90/ 150, Somavandla Palli, C.K. Dinne Mandal, Kadapa Corporation Limits, Y.S.R. District - 516 004 **(D4)**.
3. Levaku Mohan Reddy, S/o Late Nadipi Narasimha Reddy, Aged 43 years, R/at D.No.90/149, Somavandla Palli, C.K.Dinne Mandal, Kadapa Corporation Limits, Y.S.R. District - 516004 (D5). and Others.

...Defedants

2,4 మరియు 5వ ప్రతివాదులకు నోటీసు

పై నెంబరు దావాలోని వాదులు, పై ప్రతివాదులపైన బాగపరిష్కారం కోసం పై కోర్టు యందు దావా దాఖలు చేసియున్నారు. పై 2,4 మరియు 5వ ప్రతివాదులు పై దావా యందు కోర్టుకు హాజరు అగుటకు గాను 19.6.2023వ తేదీన వాయిదా వున్నది. కావున పై 2,4 మరియు 5వ ప్రతివాదులు పై దావా యందు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల 19.6.2023వ తేదీన ఉదయం 10.30 గం॥లకు పై కోర్టు వారి ఎదుట ఖుద్దున గానీ, వకీలు ద్వారా గాని హాజరై ఆక్షేపణలను తెలుపుకోరుచున్నాము. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

//కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

జి.త్రివిక్రమ్‌సింగ్
అడ్వకేట్, కడప.
సెల్: 9866790979.